59వ డివిజన్‌లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

ప్రజలకు ఏం చేశామన్నదే ముఖ్యం

- రాజకీయాల్లో గెలుపోటములు సహజం
- బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 4 : రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, కానీ ప్రజలకు ఏం చేశామన్నదే ముఖ్యమని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అభిప్రాయపడ్డారు. అర్హత లేని కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీ పథకంలో చేర్చి రూ.వెయ్యి కోట్ల నిధులు తీసుకువచ్చానని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా ప్రత్యేకంగా రూ.350 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. నగరంలో ఇప్పటికీ అవే నిధులతో పనులు సాగుతున్నాయన్నారు. గురువారం కరీంనగర్‌లోని 59వ డివిజన్‌లో జరిగిన మార్నింగ్ వాక్‌లో భాగంగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. దీనికి ఆయన హాజరై మాట్లాడారు. ఎంపీగా పదవిలో ఉండి కూడా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయి, మళ్లీ ఇప్పుడు ఎంపీగా పోటీ చేయడం అంటే ఇదేమన్నా పునరావాస కేంద్రమా? అని ఆయన ప్రశ్నించారు. నిజంగా బండి సంజయ్‌కు ఎంపీగా ఉండాలనుకుంటే ఎందుకు ఎమ్మెల్యేగా పోటీ చేశారని నిలదీశారు. తనకు కూడా బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్న సూచనలు వచ్చాయని, కానీ తాను ఎంపీగా మాత్రమే పోటీ చేస్తానని చెప్పానని గుర్తు చేశారు. ఎంపీగా ఐదేళ్లు ఉన్న బండి సంజయ్ ఒక్క రూపాయి నిధులు కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. ఏమైనా అంటే ఉపాధి హామీ, అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చే నిధులు ఎంపీగా తాను తెచ్చానని బండి సంజయ్ చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కరీంనగర్‌లో టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం రూ.26 కోట్లు తీసుకువచ్చామని చెప్పారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు నగరంలో ట్రిపుల్ఐటీ కోసం ప్రత్యేకంగా 50 ఎకరాల స్థలాన్ని కేటాయించామని, చివరి నిమిషంలో ఎన్నికలు రావడంతో అది పక్కన పడిందన్నారు. బండి సంజయ్ ఎంపీ అయిన తర్వాత ఆ విషయాన్ని పూర్తిగా మరిచిపోయారని విమర్శించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు జాతీయ రహదారులు తీసుకువచ్చామన్నారు. అలాగే, కొత్తపల్లి – మనోహరాబాద్ రైల్వే లైన్ మంజూరు చేయించి ప్రధాని మోదీతో శంకుస్థాపన చేయించామన్నారు. ఇప్పటికే ఆ రైలు సిద్దిపేట వరకు వచ్చిందని, 2025 డిసెంబర్ నాటికి కరీంనగర్ చేరుకుంటుందన్నారు. అలాగే, కరీంనగర్ నుంచి కాజీపేటకు కూడా రైల్వే లైన్ కోసం ప్రయత్నాలు చేశామన్నారు. అభివృద్ధి ఆలోచన ఉన్న వారిని గెలిపించాలని, మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టే వారిని నమ్మవద్దని కోరారు. తాను ఎప్పుడూ ప్రజల కోసం ఏం చేయాలన్న తపనతోనే పని చేస్తానని తెలిపారు.

అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించండి

ఎమ్మెల్యే గంగుల కమలాకర్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే నగరంలో అభివృద్ధి ఆటంకం లేకుండా కొనసాగుతుందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. తెలంగాణ కోసం పని చేసే వారు, పార్లమెంట్‌లో మాట్లాడే వారిని గెలిపించాలని పిలుపునిచ్చారు. వినోద్‌కుమార్ ఎప్పుడూ నగరాభివృద్ధి, నియోజకవర్గ అభ్యున్నతి కోసం పని చేశారన్నారు. ఎంపీగా ఉన్నప్పుడు రాష్ట్ర, నియోజకవర్గ సమస్యలపై అనేక మార్లు పార్లమెంట్‌లో తన గొంతు వినిపించారని గుర్తు చేశారు. బండి సంజయ్ ఒక్క రోజు కూడా రాష్ట్ర అభ్యున్నతి గూర్చి ఆలోచన చేయలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ గందె మాధవి, వాల రమణరావు, నాయకులు దూలం సంపత్, మహేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- స్వీప్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా సాగిన 2 కే రన్



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు

కొత్తపల్లి, ఏప్రిల్ 4: అర్హులైన వారందరూ బాధ్యతగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. గురువారం ఉదయం కరీంనగర్ స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 2 కే రన్‌ను కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటు వేయడం మన అందరి బాధ్యత అని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనాలని సూచించారు. జిల్లాలో దాదాపు 30 వేల మంది యువత ఓటు హక్కును నమోదు చేసుకున్నారని, వీరంతా తప్పకుండా ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు అవకాశం ఉందని, దీనిని ఓటు హక్కు లేని వారు ఉపయోగించుకోవాలన్నారు. ఓటు హక్కు నమోదు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజలంతా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటింగ్‌లో పాల్గొనాలని సూచించారు. అంబేద్కర్ స్టేడియం నుంచి ప్రారంభమైన 2కే రన్ భగత్‌నగర్ చౌరస్తా, కలెక్టరేట్, ప్రతిమ మల్టీప్లెక్స్ మీదుగా సర్కస్ గ్రౌండ్ వరకు ఉత్సాహంగా సాగింది. సర్కస్ గ్రౌండ్‌లో ఓటు హక్కు వినియోగంపై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, స్వీప్ నోడల్ అధికారి, మైనింగ్ శాఖ ఏడీ రామాచారి, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, మెప్మా పీడీ రవీందర్, ఆర్డీవో కే మహేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నతానియల్, ఎన్‌వైకే కోఆర్డినేటర్ వెంకట రాంబాబు, బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అనిల్ ప్రకాశ్, సంక్షేమ అధికారి సరస్వతి, ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత అంజనారెడ్డి, మెప్మా డీఎంసీ శ్రీవాణి, టీఎంసీ అనిత, పలువురు అధికారులు, విద్యార్థులు, వాకర్స్, మహిళలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 4: ఎన్నికల విధులతో పాటు అత్యవసర సేవల పరిధిలోకి వచ్చే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అత్యవసర సేవల పరిధిలోకి వచ్చే పలు శాఖల నోడల్ అధికారులతో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగంపై అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం 12డీ సమర్పించాలని సూచించారు. పలు శాఖల వారీగా వివరాలడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు ఫారాలను సంబంధిత నోడల్ అధికారులు సత్వరమే అందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో పవన్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్, ఆర్డీవో కే మహేశ్వర్ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఆర్‌వీ కర్ణన్

కలెక్టరేట్, ఏప్రిల్ 4 : వేసవికాలంలో జిల్లాలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం, తాగునీరు సరఫరాపై కలెక్టర్ పమేలా సత్పతి, సంబంధితాధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎక్కడ ఎలాంటి ఇబ్బంది ఎదురైనా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ బావులతో పాటు బోర్‌వెల్స్, అవసరమైన ట్యాంకర్లను సిద్ధం చేసుకుని ఉండాలన్నారు. గ్రామాల్లో పాతబావుల్లోని నీరు వాడొద్దని, అత్యవసరమైతే నీటిని పరీక్ష చేసిన అనంతరమే వాడుకోవాలన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామాల్లో పర్యటిస్తూ ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఇరిగేషన్ ఈఎన్‌సీ శంకర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో రవీందర్, ఆర్డీవో కే మహేశ్వర్, డీఆర్డీవో శ్రీధర్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూన్నెళ్లకే తెల్లముఖం చేసిన కాంగ్రెస్: ఎమ్మెల్యే గంగుల

మొగ్దుంపూర్‌లో పంటను పరిశీలిస్తున్న కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తదితరులు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 4 : రాష్ట్రం వచ్చిన పదేళ్లలో ఒక్క మడి కూడా ఎండ లేదని, కాంగ్రెస్ సర్కారు వచ్చిన మూన్నెళ్లకే బంగారు తెలంగాణను తెల్లముఖం చేశారని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మండిపడ్డారు. కరీంనగర్‌రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో ఎండిన పంటపొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన ఆవేదన చెందొద్దని రైతులకు ధైర్యం కల్పించారు. గత పదేళ్లుగా గ్రామానికి పుష్కలంగా నీళ్లందించామని, కేసీఆర్ పాలనలో గ్రామాలు సస్యశ్యామలంగా ఉన్నాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన మూన్నెళ్లకే ఇంతటి కరువు వస్తుందని ఎవరూ ఊహించలేదన్నారు. గతంలో కొత్తపల్లి చెరువు ఎప్పుడూ మత్తడి దుంకి అక్కడి నుంచి వాగు ద్వారా నగునూర్, మొగ్దుంపూర్, చేగుర్తి వరకు నీళ్లు వచ్చేవని తెలిపారు. ప్రణాళిక ప్రకారం సరఫరా చేస్తే అందరికీ నీళ్లు అందేవని, అలా చేయకపోవడం వల్లనే వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జక్కం నర్సయ్య, నాయకులు దామరపల్లి అంజిరెడ్డి, సుంకిశాల సంపత్‌రావు, కుక్కట్ల తిరుపతియాదవ్, కందుల రమేశ్‌గౌడ్, తొగరు మల్లారెడ్డి, మంద అశోక్, దాడి లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

సీతారాముల కల్యాణ ఏర్పాట్ల పరిశీలన

ఇల్లందకుంట, ఏప్రిల్ 4: ఇల్లందకుంట సీతారాముల కల్యాణ ఏర్పాట్లను గురువారం హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ఈ నెల 17న సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ ఆలయ ఈవో కందుల సుధాకర్, తహసీల్దార్ పీ రాణి, సీఐ కిశోర్, ఎస్ఐ రాజ్‌కుమార్, ఆలయ సిబ్బంది, మోహన్, రాజన్న, మల్లారెడ్డి, ఆర్ఐ రవి తదితరులు ఉన్నారు.

నైపుణ్యంతో కూడిన విద్య నేర్చుకోవాలి

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 4: ప్రతి విద్యార్థి నైపుణ్యంతో కూడిన విద్య నేర్చుకోవాలని టాస్క్ శిక్షకుడు రమేశ్ సూచించారు. గురువారం సింగాపురంలోని కిట్స్ కళాశాల సమావేశ మందిరంలో 'కిట్స్ సైబర్ అసోసియేషన్' విద్యా సంవత్సరం ప్రారంభ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. విద్యార్థి సాంకేతిక విషయ పరిజ్ఞానం, నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగ సాధనలో ముఖ్య భూమికలు పోషిస్తాయని తెలిపారు. సమావేశం అనంతరం కిట్స్ సైబర్ అసోసియేషన్ విద్యార్థి కార్యనిర్వాహక కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా అరవింద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శరణ్య, కార్యదర్శిగా శంకర్, కోశాధికారులుగా రుత్విక్ రెడ్డి, సచిన్, భరద్వాజ్‌తో పాటు పది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కిట్స్ డైరెక్టర్ డాక్టర్ కే శంకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య, సమన్వయకర్త, అధ్యాపకుడు పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'వీఎస్ఆర్'లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 4: సింగాపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ వీవీఎన్ హనుమకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోనీ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ, హైదరాబాద్ బ్రాంచ్ ప్రతినిధులు హాజరై, కళాశాలకు చెందిన 40 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియామకాల అధికారి తాళ్లపల్లి అజయ్, సోనీ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ యాజమాన్యం రణధీర్, రామ్మోహన్ రెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లి దిష్టిబొమ్మ దహనం

మానకొండూర్, ఏప్రిల్ 4: ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎమ్మెల్యే కవ్వంపల్లి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు బెజ్జంకి అనిల్, ఇంజం వెంకటస్వామి, రుద్రారపు రాంచందర్, తుంగ ఆంజనేయులు, తడగొండ శంకర్, ఆదిత్య, అనిల్, శ్రీనివాస్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 4: కరీంనగర్ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థుల నుంచి రెండు నెలల డీఎస్సీ ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డిప్యూటీ డైరెక్టర్ నతానియేలు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు 7వ తేదీలోగా అంబేద్కర్ భవనం, స్టడీ సర్కిల్‌లో సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9885218053, 9573401227, 9177605511 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ ఉద్యోగాలకు

విద్యానగర్, ఏప్రిల్ 4 : కొత్తపల్లిలో గల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డీఎంఈ ఆదేశాల మేరకు తాత్కాలిక కాంట్రాక్ట్ పద్ధతిన ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ షీలా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కాలేజీ వెబ్‌సైట్‌లో అప్లికేషన్ ఫారం నియమ నిబంధనలకు సంబంధించిన కాపీలను పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 7లోగా పూర్తి చేసిన అప్లికేషన్ ఫారం రెండు సెట్స్ జిరాక్స్ కాపీలను అందజేయాలని సూచించారు. ఈ నెల 8న సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

ఉగాది పురస్కారాలకు

తెలంగాణచౌక్, ఏప్రిల్ 4: తెలుగు నూతన సంవత్సరం ఉగాదిని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంత కవులు, కళాకారులు, సమాజసేవకులు. ఆధ్యాత్మిక, యోగ గురువులను గుర్తించి పురస్కారాలను అందించనున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు ఈఎస్ఎస్ నారాయణ మాస్టార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు, ఆసక్తి ఉన్న వారు తమ నైపుణ్య వివరాలతో ఈ నెల 10లోగా దరఖాస్తులను ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి, సికింద్రాబాద్ చిరునామాకు పంపించాలని తెలిపారు.

ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి

చిగురుమామిడి, ఏప్రిల్ 4: సాగునీరు అందక ఎండిన పంటలను ప్రభుత్వం సర్వే చేయించి రైతులకు పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు అందె స్వామి, మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మీరెడ్డి డిమాండ్ చేశారు. లంబాడి పల్లి, గాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎండిపోయిన వరి పంటలను గురువారం పరిశీలించారు. ఇక్కడ నాయకుడు తేరాల సత్యనారాయణ, సింగిల్ విండో డైరెక్టర్లు చాడ శ్రీధర్ రెడ్డి, ముద్రకోల రాజయ్య, నాయకులు రాజయ్య, అందె చిన్న స్వామి, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, ఉస్మాన్ పాషా, బందెల శ్రీనివాస్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మానకొండూర్, ఏప్రిల్ 4: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని కనీస మద్దతు ధర పొందాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో హాకా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతి సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, సివిల్‌సప్లై డీఎం రజినీకాంత్, డీసీఎస్‌వో గౌరీశంకర్, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో నర్సయ్య, హాకా ప్రతినిధి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 4: ఎన్‌హెచ్ఎంలో విధులు నిర్వహిస్తున్న రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ప్రెస్ భవనంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో ఏఎన్ఎంల జిల్లా స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పని గంటలకు మించి విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసే వరకు పోరాటాలను కొనసాగిస్తామన్నారు. అనంతరం రెండో ఏఎన్ఎం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షురాలిగా రాణి, ప్రధాన కార్యదర్శిగా రజిత, కోశాధికారిగా సరోజ, ఉపాధ్యక్షులుగా శోభ, విజయలక్ష్మితో పాటు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

వద్దంటే వెళ్లి తిరిగి రాని లోకాలకు..

- ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో చింతగుట్ట వాసి మృతి
- కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు

ఆంజనేయులు (ఫైల్)

శంకరపట్నం, ఏప్రిల్ 4: 'వద్దన్నా వినకుండా ఫంక్షన్‌కు వెళ్లి శవమై ఇంటికి తిరిగి వచ్చావా'.. అంటూ ఎర్రటి ఎండలో నడి రోడ్డుపై గుండెలవిసేలా భార్యా, తల్లి రోదించిన తీరు చూపరుల హృదయాలను కలిచివేసింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామానికి చెందిన సిరిసిల్ల ఆంజనేయులు (34) వ్యవసాయ కూలీగా పని చేసేవాడు. ఇటీవల ఓ హార్వెస్టర్ కొనుగోలు చేసి నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం గ్రామస్తులు అంతా కలిసి సామూహిక పోచమ్మ బోనాలకు సిద్ధం అవుతుండగా ఆంజనేయులు మాత్రం హుజూరాబాద్ మండలంలో జరిగే సమీప బంధువుల ఫంక్షన్‌కు వెళ్లేందుకు రెడీ అయ్యాడు. అయితే ఊళ్లో పోచమ్మ బోనాలు ఉన్నందున వెళ్లవద్దని తల్లీ, భార్యా ఎంతగా వారించినా వినలేదు. అతడి మేనల్లుడు మంద హరీశ్‌ను వెంటబెట్టుకుని బైక్‌పై వెళ్లి తిరిగి చింతగుట్టకు వస్తుండగా, మధ్యాహ్నం 3 గంటల సమయంలో కేశవపట్నం బస్టాండ్ వద్ద ఎదురుగా వచ్చిన సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు పైనుంచి బస్సు వెళ్లగా అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న హరీశ్ సురక్షితంగా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ లక్ష్మారెడ్డి, పోలీసు సిబ్బందితో అక్కడకు చేరుకుని మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానలోని మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడికి తల్లి బుచ్చమ్మ, భార్య పూజ, 4వ తరగతి చదువుతున్న సాయి గణేశ్, 1వ తరగతి చదువుతున్న సాత్విక్ ఉన్నారు. పూజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరవలసిన ఆంజనేయులు మృతి చెందాడన్న వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులతో పాటు చింతగుట్టకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకొని విలపించారు.

కరపత్రాల ఆవిష్కరణ

గన్నేరువరం, ఏప్రిల్ 4: మండలకేంద్రంలో రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాలను మాల మహానాడు నాయకులు గురువారం ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.

హన్మాజీపల్లిలో పోలీసుల కవాతు

గన్నేరువరం, ఏప్రిల్4: హన్మాజీపల్లిలో గురువారం సీఐఎస్ఎఫ్ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్ఐ నరేశ్, ఆర్ఎస్ఐ ప్రసాద్, షీ టీం మెంబర్స్, పోలీసులు పాల్గొన్నారు.

పంటలు ఎండిన రైతులకు బీజేపీ నాయకుల పరామర్శ

కొత్తపల్లి, ఏప్రిల్ 4: మండలంలోని చింతకుంట, మల్కాపూర్ గ్రామాల్లో సాగనీరందక పంట నష్టపోయిన రైతులను బీజేపీ నాయకులు గురువారం పరామర్శించారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నాయకులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు కడార్ల రతన్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వేముల అనిల్‌కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టవెని రేణు, యువ మోర్చా మండలాధ్యక్షుడు యువ ప్రశాంత్, దాసరి రవి, సదానందం, సురేశ్, విజయ్, శ్రావణ్, శ్రీనివాస్, జీవన్, రవి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

వైస్ ఎంపీపీకి సత్కారం

తిరుపతినాయక్‌ను శాలువాతో సత్కరిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి, ఏప్రిల్ 4 : మండల వైస్ ఎంపీపీగా ఇటీవల ఎన్నికైన భూక్యా తిరుపతినాయక్‌ను గురువారం అల్పోర్స్ విద్యా సంస్థల అధినేత వీ నరేందర్‌రెడ్డి